# పిరికివాడు

శత్రుసదేశంమీదకు పరదేశం దండెత్తి నెమ్మదిగా ఆక్రమించు కుంటున్నదని వినగానే, పిరికివాడు రెండు రకాల జండాలు తయారు చేసికొని కూర్చున్నాడు - ఒకటి స్వదేశంజండా, ఒకటి దండెత్తివచ్చిన పరదేశం జండా.

'స్వదేశం గెలిస్తే ఈ జెండా, పరదేశం గెలిస్తే ఈ జెండా' అని మనస్సులో అనుకొని, గదిలో ఒకమూల పెట్టాడు. ఇక ఏ దేశం గెలిచినా తన కేమీ పరవా లేదనుకున్నాడు. 'స్వదేశం గెలిస్తే స్వదేశం జెండా వుండనే వుంది. పరదేశం గెలిస్తే పరదేశం జెండా వుండనే వుంది. ఇక నా కేం?' అను కున్నాడు. పరదేశ సైన్యాధ్యక్షుడిమీద, 'నీకు దీర్ఘాయురస్తు' అని కొన్ని సీసపద్యాలు రాసి తయారుగా వుంచుకొన్నాడు కూడాను.

అసలు పిరికివాడికి రెండు దేశాలు ఎందుకు యుద్ధంలోకి దిగాలో, ఇంతమంది తమ ప్రాణాలను దేశంకోసం ఎందుకు అర్పించాలో అర్థమయ్యేదికాదు. సంకుచితదృష్టి, మూర్ఖత్వం ఈ రెండే దీనికి కారణం అనుకునేవాడు. తాను ఈ కక్షలకు అతీతుడననీ, తన హృదయం అతి విశాలమనీ అనుకునేవాడు. కనుక మూర్ఖులు యుద్ధాలుచేసుకొని రక్తపాతం కలిగించుకునే టప్పుడు తనబోటి విశాలహృదయులు ఏం చెయ్యాలి? తమ

సుఖంకోసం తాను పాటు పడాలి. ఆలోచించి పిరికివాడు ఈ నిర్ణయానికొచ్చి దానికోసం పాటుపట్టం మొదలుపెట్టాడు.

కాని యుద్ధం తీవ్రరూపం తాల్చిం దగ్గరనుంచీ పిరికివాడు తను తలపెట్టిన కార్యం అనుకున్నంత తేలిక కాదని గ్రహించాడు. ఏ దేశం గెలుస్తుందో ముందే ఎలా తేల్చుకోవటం?

రాత్రంతా ఆలోచించి ఇక స్వదేశం గెలవదు గనుక పరదేశం జెండాపట్టుకొని బయల్దేరదామని నిశ్చయించుకొని తెల్లవారి లేచేటప్పటికి "స్వదేశం సేనలు కొన్ని కొన్ని రంగాల్లో గెలిచాయి," అని పెద్ద పెద్ద అక్షరాల్తో వార్తా పత్రికలు ప్రచురిస్తూ వుండేవి. స్వదేశిజెండా పట్టుకొని బయల్దేరదామనుకొన్నరోజు, "విదేశ సేనలు స్వదేశ సేనలను తరిమి వేశాయి," అని వార్తలు వస్తుండేవి.

పిరికివాడికి ఏమీ తోచక, ఏ జెండా పట్టుకొని వూరేగాలో తెమల్చుకోలేక హైరానయి పోయాడు. రెండుజెండాలనూ ఎదురుగా ఎప్పుడూ ఆగదిలోనే కూర్చునేవాడు. తానురాసిన పద్యాలు మోకాలుమీద కూర్చుని రిహార్సల్సు వేసుకునేవాడు. ఒకక్షణం విదేశంజెండా భుజంమీద పెట్టుకొని గదిలో ఇటూ అటూ పచారు చేసేవాడు—ఒక క్షణం స్వదేశం జండా పట్టుకొని గంతులు వేసేవాడు. రెండూ మూలపెట్టి,

ఎదురుగా నిలబడి, "స్వదేశం గెలిస్తే ఈజెండా, విదేశం గెలిస్తే ఈజెండా," అని వెర్రిగా అరిచేవాడు.

ఒకరోజు శత్రువు ఆవ్వూరమీదికే వస్తున్నాడనీ, ఏభై మైళ్ళ దూరంలో వున్నాడనీ వదంతులు ప్రబలినై. సైన్యంలోజేరగా మిగిలిన ధైర్యవంతులు వ్వూరుఖాళీ చెయ్యటం మొదలు పెట్టారు. పిరికివాడికి ఆవేశం ఎక్కింది. ఇన్నాళ్ళనుంచీ తాను వేసుకున్న ప్లాను, ఆచరణలో పెట్టి దాని ఫలితాన్ని అనుభవించే గడియ దగ్గర కొచ్చిందనుకొన్నాడు. కదలకుండా తన గదిలోనే జెండాలకు ఎదురుగా బాచీపెట్టు వేసుక్కూచుని, "స్వదేశం గెలిస్తే ఈజెండా, విదేశం గెలిస్తే ఈ జెండా!" అనుకొని "ఈజెండే, ఈజెండే, ఇదే జెండా!" అనుకుంటూ వెర్రివాడిలా గదంతా చిందులు తొక్కాడు.

ఒక స్నేహితుడు కావలసిన సామానంతా వీపుకుకట్టు కొచ్చి, "రావ్వూ?" అని అడిగాడు.

"నేనా? నేనెందుకు రావటం? నేనేం పిరికివాణ్ణా? పిరికివాళ్ళు పారిపోండి. నేరాను. ఈజెండా, ఈజెండా, ఇదేజెండే," అన్నాడు పిరికివాడు.

బయట ఖాళీచేస్తున్న జనం కోలాహలం పిరికివాడి గదిలో క్కూడా వినిపిస్తూవుంది. రోడ్డమీద జనం అన్నిదిక్కులకూ తోకలు తెగిన నక్కల్లా పరుగెత్తుతూవుంది. అంతజనంలోనూ

బళ్లూ కార్లూ కళ్ళు మూసుకొని తిరుగుతున్నై. మధ్యమధ్య మిలిటరీ కార్లు గంటలు గణగణ మోగించుకుంటూ రయ్యిన వెళ్తున్నై. దూరాన్నుంచి బాంబులు పేలినధ్వనులు వినిపిస్తున్నై. జనానికి ఏంచెయ్యాలో తెలియక, ఎక్కడికి పారిపోటానికీ తోచక, రోడ్డుకి అడ్డంగా, బయల్దేరిన చోటునుంచి పరుగెత్తిన చోటుకీ, పరుగెత్తిన చోటునుంచి బయల్దేరిన చోటుకీ పరుగెత్తుతూ కార్లకిందా బళ్ళకిందా పడి నలిగిపోతూ వుంది. మనుష్యుల్లోని ఈచలనమంతా శారీరకమే! బుర్రలు ఆట్టం ఎప్పుడో మానుకున్నై. యుద్ధంరోజుల్లో బళ్ళే మనుష్యులూ—మనుష్యులే బళ్ళూ!

పిరికివాడు గదిలోనుంచి ఇదంతా చూశాడు. పారిపోతున్న జనాన్ని చూచి తనలోతాను నవ్వుకున్నాడు- "పిరికివెధవలు," అనుకున్నాడు. జవహర్‌లాల్ ఏమన్నాడు? " జయలక్ష్మి ధైర్యస్థుల్నే వరిస్తుంది." వెంటనే పరదేశం జండా పట్టుకొని, "ఈజెండా, ఈజెండా, ఇదే జెండా," అనుకుంటూ బజార్న పడ్డాడు.

జనం అతన్ని మిలిటరీ లారీని చూచినట్లు చూచి రెండు పాయలై దారిచ్చింది. పిరికివాడు ఆమధ్యనుంచి పరదేశం జెండా బుజానపెట్టుకొని, "ఇదేజండా, ఒకటేజండా, ఒకటే

జండా, ఏకైక జండా," అని కేకలు పెట్టుకుంటూ పరిగెత్తుతున్నాడు.

జనం విరగబడి తొక్కుకుంటూ ఉందేగాని అతన్ని ఏమీ అనలేదు. గుడ్లువప్పజెప్పి చూస్తూ వూరుకుంది. ఏపనిచేస్తున్న మనిషి ఆపని ఆపేసి స్థాణువై నిలబడి చూస్తున్నాడు. బళ్ళూ కార్లే ఎక్కడివి అక్కడ ఆగిపోయినై.

"పాపం పిచ్చెత్తింది" అని కొందరు చప్పరించారు. యుద్ధం నుంచి కాళ్లు విరగ్గొట్టుకొనీ, చేతులు విరగ్గొట్టుకొనీ,మూతులు పగలగొట్టుకొనీ, మెదళ్లు చిట్లగొట్టుకొనీ పిచ్చెక్కి వికృతాకారాలతో రోడ్లమీద తిరిగే మనుష్యుల్ని, ఈమధ్య ఆ వూరి ప్రజలు చాలమందిని చూచివున్నారు. అందుకనే తేలిగ్గా 'పిచ్చెక్కింది' అనే నిర్ణయం ........

పిరికివాడు ఆవిధంగా పరిగెత్తి పరిగెత్తి వూరిబయటకు పరుగెత్తాడు. అక్కడ ఒక్క క్షణంనిలబడి బాంబులు పేలుతున్న వైపుకి చూశాడు. దూరంగా చెట్లచాటునుంచీ, గుట్టల చాటునుంచీ తుపాకీలతో బిలబిలా పరుగెత్తుకు వస్తున్న సైన్యాన్ని చూశాడు.

చెయ్యి వొణికింది. భుజంమీద వున్న విదేశజెండా రెపరెప కొట్టుకుంది. హృదయం ఆవేశంతో తుకతుకలాడింది. తనశక్తి నంతా కేంద్రీకరించుకొని "జై జై ! ఈ జెండాకే జై ! ఇదే

జెండాకీ జై !" అని కేకలు పెట్టుకుంటూ వచ్చే సైన్యానికి ఎదురుగా మళ్లీ పరుగు లంకించుకున్నాడు. ఒక్కొక్క అడుగు దగ్గరకు వెళ్తున్న కొద్దీ గాలే మారిపోతున్నది. ముక్కు రంధ్రాల్ని బద్దలుకొట్టే కంపు, ఢాం, ఢీం, ఢూం, అనిశూన్యాన్ని కూడా బద్దలుకొట్టే మోతలు. కళ్ళు తెరవటమే కష్టమయింది. అలాగే పిరికివాడు శరీరాన్ని బిగబట్టి పరిగెత్తాడు. భుజంమీద వున్న జెండా గాలికి గిల గిల కొట్టుకుంటూవుంది. హఠాత్తుగా పిరికివాడు భూమిలో గుచ్చుకుపోయినట్టు ఆగిపోయాడు.

అంతా నిశ్శబ్దం. బాంబులమోతలు ఒక్కసారిఆగిపోయినై. పిరికివాడు నెమ్మదిగా కళ్ళు తెరచి చూశాడు. శవాలు. ఎటు చూచినా శవాలే! తనచుట్టూశవాలే!! కొంచెందూరంలో సైన్యం.

ఆ సైన్యం ఇదివరలాగా లేదు. అంతాకలసి ఉప్పొంగిన హృదయంలాగా, పొంగిన సముద్రంలాగా వొస్తూవుంది. ఆ సైన్యానికి ముందు నడుస్తున్న వ్యక్తిని చూశాడు పిరికివాడు. అతని చేతిలోనూ జెండావుంది. అదీ రెపరెప గిలగిలలాడుతూ వుంది. "జై, జై. ఈ జెండాకీ జై. ఇదే జెండాకీజై. పరదేశ జెండాకీ జై," అని అరిచాడు. పిరికివాడు.

కాని ఇదేమిటి? అదేం జెండా!!!

దిమ్మతిరిగి కళ్ళు బయర్లుకమ్మి పిరికివాడి చూపు సరిగ్గా

అనటం లేదు. సైన్యం అలికిన గోడలా కనిపించింది. వాళ్ళచేతుల్లోని తుపాకులు నెమలి పింఛాల్లా విప్పారుకుంటున్నట్లు కనిపించాయి. జెండాపట్టుకున్న వ్యక్తి తోలుబొమ్మలా రెల్లుదుబ్బులా కనిపించాడు.

అతనిచేతుల్లోని జెండా స్వదేశం జెండా!

పిరికివాడు నమ్మలేకపోయాడు. కళ్ళుతుడుచుకొని చూట్టానికి తన చేతులో జెండా వుండె. మళ్ళీ సైన్యాన్ని చూశాడు. స్వదేశ సైనికుల్లా కనిపించారు.

ఏమిటిది? అతని గుండెలు పగిలినై. అది స్వదేశం జెండాయే! అది స్వదేశం సైన్యమే!! తాను పొరపాటుపడ్డాడు. ఈ సంగతి ఆకలింపుకిరాగానే తన గదిలోవున్న స్వదేశంజెండా జ్ఞాపికి వచ్చింది. కెవ్వున కేకవేసి గిరుక్కునతిరిగి తన ఇంటికి, స్వదేశం జెండాకోసం పరుగు లంకించుకున్నాడు.

ఢాం... ఢాం:

పరుగెత్తే పిరికివాడి గుండెల్లోకి ఒకేసారి రెండు గుళ్లు జొరబడ్డాయి. ఒకటి సైన్యంలోనుంచీ, ఒకటి చెట్టుచాటునుంచీ వచ్చినై. ఒకటి వీపులోనుంచీ, ఒకటి రొమ్ములోనుంచీ గుండెల్లోదూరి కలుసుకున్నై. ఆ విశాల హృదయంలో * స్వదేశ విదేశీ నాగరికతల సమ్మేళన ఈవిధంగా జరిగింది.

"అమ్మో!" అనే భయంకర ఆర్తనాదమే ఈ సమ్మేళన ఫలితం.

పిరికివాడు ఆ రెండు గుండుదెబ్బల్తో కిందపడి, లుంగలు పడి, చాపలా చుట్టుకుపోయి, తల రొమ్ములోకి దూర్చుకొని, ప్రాణాలువొదిలాడు. ప్రాణాలు పోయేముందు ఒక్కసారి మాత్రం పెదవులు కదలినై — "స్వదేశం గెలిస్తే ఈజెండా, పరదేశం గెలిస్తే ఈజెండా!"